క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని పరిష్కరించేందుకు ఇటువంటి కార్యక్రమం వేదికగా నిలుస్తుందన్నారు. ఈవో ఆర్డీ సోమరాజు, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, ఏపీఎం బాలరాజు, విద్యుత్ శాఖ ఏఈ గోపీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చినరామాలయం ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



పాఠశాలకు కొబ్బరి మొక్కలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు రమేష్

ఎస్.రాయవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టాలని వమ్మవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ అన్నారు. రమేష్ తన కొబ్బరి తోటలో ఉన్న 100 కొబ్బరి మొక్కలను ధర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాలకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్‌రావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగిరెడ్డి ఆదినారాయణ, ఉపాధ్యాయులు ఆర్.అప్పలనాయుడు, గారా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



మునగపాక హైస్కూల్‌లో గీచిన చిత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఈవో-1 వేణుగోపాలరావు కోరారు. భారత రాజ్యాంగం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు గీచిన చిత్రాలను సోమవారం ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, భారత రాజ్యాంగ చిహ్నం, ఆదేశిక సూత్రాలు, తదితర అంశాలకు సంబంధించి పాఠశాలల్లో ప్రదర్శించడం ద్వారా అవగాహన పెరుగుతుందన్నారు. ఎంఈవో-2 బుద్ధ శివనాయుడు, పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, హెచ్ఎం శ్రీనివాసరావు, సీఆర్పీ అచ్యుతకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,

రాష్ట్ర బీసీ మహిళా సంఘం కార్యదర్శిగా రమణమ్మ



రమణమ్మ

యలమంచిలి రూరల్: రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శిగా యలమంచిలికి చెందిన లాలం రమణమ్మ(రజిని) నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వర్రావు ఆమెకు నియామక ఉత్తర్వులు సోమవారం అందజేశారు. పట్టణానికి చెందిన రమణమ్మ కొన్నేళ్లుగా బీసీ వర్గాల అభ్యున్నతికి, బీసీ మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. మహిళలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేస్తానని రమణమ్మ తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన సంఘం నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మలుపులు.. ప్రమాదాలకు సూచికలు



టి.సిరసపల్లిలో ప్రమాదకరంగా మలుపు

- గ్రామీణ రహదారుల్లో అడుగడుగునా దర్శనమిస్తున్న మలుపులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- భయాందోళనల మధ్య వాహనచోదకుల ప్రయాణం

మునగపాక: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రాత్రి వేళలో రయ్ రయ్‌మంటూ వచ్చే వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురికావడం, ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. రహదారుల విస్తరణ మాట దేవుడెరుగు.. ప్రమాదకరంగా తయారైన మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కానరావడం లేదని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల రహదారులు ఇరుకుగా ఉండడం.. దీనికి తోడు మలుపులు పెరిగిపోవడం కారణంగా రాకపోకలకు జనం నానా అవస్థలు పడుతున్నారు. మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

- మునగపాక నుంచి వాడ్రాపల్లి మీదుగా మల్లవరం అలాగే గొల్లలపాలెం, కుంచవానిపాలెం తదితర గ్రామాలకు వెళ్లే దారిలో పలు చోట్ల మలుపులు పెరిగిపోయాయి. అడుగడుగునా మలుపులే దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రుల సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడకు వెళ్లే రోడ్డులో పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. నిత్యం ఈ మార్గంలో పరవాడలోని పలు ప్రైవేటు కంపెనీల ఉద్యోగులతో పాటు పలువురు వ్యాపారులు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. తోటాడ, టి.సిరసపల్లి, వెంకటాపురం తదితర గ్రామాల్లో మలుపులు దర్శనమిస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



అనకాపల్లి నుంచి తోటాడ మార్గంలో మలుపు

అచ్యుతాపురం మండలం కొండకర్ల నుంచి మునగపాక మండలం చూచుకొండ, గణపర్తి, మెలిపాక గ్రామాలకు వెళ్లే రోడ్డు అసలే ఇరుకు. దీనికి తోడు దారి పొడవునా మలుపులే దర్శనమిస్తున్నాయి. మలుపుల వద్ద ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడాల్సిందే. ఈ మార్గంలో రాత్రి పూట ప్రయాణం అంటేనే భయం గుప్పిట్లో రాకపోకలు సాగించాల్సి ఉంది. నిత్యం ఈ మార్గంలో అటు మునగపాకకు ఇటు యలమంచిలికి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.



ప్రమాదకరంగా ఉన్న చూచుకొండకు వెళ్లే మార్గంలోని మలుపు



కొత్త నాగవరానికి వెళ్లే దారిలో మలుపు

పాత నాగవరం అలాగే రాజుపేట నుంచి కొత్త నాగవరం మీదుగా అటు పరవాడ, ఇటు మునగపాకకు నిత్యం వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. కొత్త నాగవరం సచివాలయ ప్రాంగణంతో పాటు ఇతర చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

అడుగడుగునా మలుపులే..

చూచుకొండకు వెళ్లే మార్గంలో అడుగడుగునా మలుపులే దర్శనమిస్తున్నాయి. మలుపుల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో పలు మార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేకపోలేదు. మలుపుల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
–గుంట్ల అప్పారావు, ద్విచక్ర వాహనదారుడు, మెలిపాక



ప్రమాదాల నివారణకు చర్యలు

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే దారిలో మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటాం. రహదారుల నిర్మాణంలో భాగంగా ఎలైన్‌మెంట్ ప్రకారం రహదారులు నిర్మిస్తారు. కొన్ని చోట్ల తప్పనిసరి పరిస్థితుల్లో మలుపులు ఉంటాయి. వాహనదారులు కూడా వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చూస్తాం. – పద్మిని, ఆర్‌అండ్‌బీ ఏఈ

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడకు వెళ్లే మార్గం అసలే ఇరుకు రోడ్డు. ఈ రోడ్డులో పలు చోట్ల మలుపులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.
–మద్దాల వీరునాయుడు, ద్విచక్ర వాహనదారుడు, సిరసపల్లి



ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ



కొత్తూరులో ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ

రాంబిల్లి(యలమంచిలి): ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం రాంబిల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. కొత్తూరు హైస్కూల్‌లో మండలంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలను కలిసి రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని, 117 జీవో రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు పాత డీఏ బకాయిలను విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించడం, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రఘువర్మను పలువురు ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, జిల్లా పూర్వ అధ్యక్షుడు నీరుకొండ వెంకట సూర్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, సంఘం నాయకులు కె.వి.రమణ, తమ్మిరాజు, సీతారామరాజు, మండల నాయకులు కామరాజు, బి.వి.సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాల్తేరులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సభ్యులు

పాయకరావుపేట: పాల్తేరు గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. మార్గశిర మాసం అమావాస్య సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. మార్గశిర మాసంలో శిరము అనగా తల అని, మార్గం అనగా దారి అని, తల లోనికి దారి అనే విధానం ఉన్నది అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని హితవు పలికారు. మార్గశిర మాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలని చెప్పారు. దైవ భక్తితో గ్రంథ పఠనంతో జ్ఞానంలో ఉండాలని ప్రబోధించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఉపాధ్యక్షుడు బి.శాంతరాజు, సభ్యులు సత్యవతి, స్వాతి, నందన, సర్వజిత్, జలంధర్ పాల్గొన్నారు.

ఎస్ఈజెడ్ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న కృష్ణంపాలెం గ్రామ ప్రజలు

రాంబిల్లి(యలమంచిలి): ఎస్ఈజెడ్ ఏర్పాటులో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ప్యాకేజీ, పునరావాసం కల్పించి ఆదుకోవాలని తహసీల్దారు ఎ.శ్రీనివాసరావును కృష్ణంపాలెం గ్రామ ప్రజలు కోరారు. సోమవారం గ్రామంలో సర్వేలో భాగంగా వచ్చిన తహసీల్దారుకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎస్ఈజెడ్ కోసం తమ భూములు తీసుకొని 17 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి తమకు పునరావాసం కల్పించలేదని, భూములకు సంబంధించి ప్యాకేజీలు అందించలేదని ఆరోపించారు. ఇప్పటికే గ్రామంలో రెండు సార్లు ఉన్నతాధికారులు సర్వే చేసి జాబితాలు తయారు చేశారని, మళ్లీ అధికారులు గ్రామంలో రీసర్వే చేస్తున్నారంటే నిర్వాసితులను మోసం చేయడం తప్పా తమకు మంచి జరుగుతుందని అనుకోవడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. ఇలా సర్వేల పేరుతో తాత్సారం చేస్తూ నిర్వాసితులను మభ్యపెట్టడం ప్రభుత్వానికి, అధికారులకు సరికాదని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు.

జెడ్పీ నిధులు కేటాయించాలని వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ దేవి, గోవిందరావు

ఎస్.రాయవరం: జిల్లా పరిషత్ నుంచి ఎస్.రాయవరం మండలానికి అభివృద్ధి నిధులు కేటాయించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రను జెడ్పీటీసీ కాకర దేవి కోరారు. ఈ మేరకు సోమవారం విశాఖలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావుతో పాటు ఆమె మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్.రాయవరం మండలంలో చాలా సమస్యలు ఉన్నాయని, వరహానది ఏటి గట్టు అత్యంత ప్రమాదకరంగా ఉందని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పూర్తి స్థాయిలో తరగతి గదులు లేవని, తాగునీరు కూడా అందడం లేదన్నారు. నిధులు కేటాయిస్తే ఆ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దీనికి జెడ్పీ చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయింపు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే చర్యలు

యలమంచిలి రూరల్: కొత్త సంవత్సరం సంబరాల్లో హద్దు మీరితే చర్యలు తప్పవని యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం యలమంచిలి సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెస్టారెంట్లు, బార్‌లు, మద్యం దుకాణాలు ఇలా ప్రతి ఒక్కరూ తమ సూచనలకు లోబడి నడుచుకోవాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహించకూడదన్నారు. మంగళవారం రాత్రి గస్తీ తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వాహనాలు తనిఖీ చేయనున్నట్టు చెప్పారు.

రాంబిల్లి(యలమంచిలి): న్యూయర్ వేడుకల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కోయడం, బాణసంచా పేల్చడం నిషేధమని రాంబిలి సీఐ సిహెచ్.నరసింగరావు పేర్కొన్నారు. వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు.

మునగపాక: నూతన సంవత్సర వేడుకల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు. అశ్లీల నృత్యాలు, డీజేలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి వేడుకలను జరుపుకోవాలని ఆయన సూచించారు.

కోటవురట్ల: కొత్త సంవత్సర వేడుకలను ఇళ్లల్లో మంచి వాతావరణం మధ్య చేసుకోవాలని ఎస్ఐ రమేష్ కోరారు. యువత మద్యం సేవించి బైక్ రైడింగ్ చేసినా, వీధుల్లో గొడవ చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని తోటాడలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సు ద్వారా వచ్చే ప్రతి అర్జీకి న్యాయం చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, రీ-సర్వే డీటీ పడాల్, దొడ్డి కోటేశ్వరరావు, దొడ్డి శ్రీనివాసరావు, దొడ్డి రమేష్, సచివాలయ కార్యదర్శి శ్రీలక్ష్మి, తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన వెంకన్న



లక్క గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి లక్క గరుడ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ముందుగా కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి నిత్యార్చనలు, పూజలు చేశారు. అనంతరం కొండ దిగువన స్వామివారి ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి నిత్యార్చనలు, పూజలు జరిపారు. శ్రీదేవి భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామిని లక్క గరుడ వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోను ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి ఆచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరగనుందని కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో మొత్తం 11 అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నామన్నారు. అజెండా కాపీలను ఇప్పటికే వార్డు కౌన్సిలర్లకు పంపించినట్టు తెలిపారు.

హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



దిమిలి రోడ్డు కూడలిలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటులో అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం యలమంచిలి పాత జాతీయ రహదారిపై దిమిలి రోడ్డు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద యూనియన్ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమిత్‌షా పార్లమెంటులో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అమానుషమన్నారు. రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా అంబేడ్కర్‌ను అగౌరవ పర్చడమంటే, రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కూర్మారావు, జానకి, అప్పన్న, రాము, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు



కోటవురట్లలో సైన్స్ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కొత్తపేట జెడ్పీహెచ్ పాఠశాలలో నమూనాలు పరిశీలిస్తున్న ఎంపీపీ గోవింద్, తదితరులు



ఎస్.నర్సాపురంలో సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను సర్పంచ్ బి.అనిల్‌కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ మెదడుకు పదును పెట్టి పలు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఎంఈవోలు టి.రామారావు, శ్రీజోష్ మాట్లాడుతూ మండల స్థాయిలో జరిగిన ఈ ప్రదర్శనలో ఆరు స్కూళ్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. ఒక్కో స్కూల్ నుంచి 3 ప్రాజెక్టుల చొప్పున మొత్తం 18 ప్రాజెక్టులు ప్రదర్శించారన్నారు. ఇందులో ఉపాధ్యాయుల విభాగం నుంచి కోటవురట్ల జెడ్పీ హైస్కూల్, విద్యార్థుల విభాగం నుంచి కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్, గ్రూప్ విభాగం నుంచి కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాజెక్టులు మండల స్థాయిలో ఎంపికైనట్టు తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పుత్రేవు వెంకట సూర్యారావు, వంగలపూడి రాంబాబు, కో-ఆప్షన్ మెంబర్ షేక్ ఖుదాబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా బోధన చేయాలని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. వివిధ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను ఆయన అధికారులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ వలన విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. 11 స్కూళ్ల నుంచి 18 వినూత్న ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. పలు నమూనాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, ఎంఈవోలు వై.మీనాక్షి, అరుణ్ కుమార్, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, హెచ్ఎంలు వైవీ రమణ, శ్రీరామమూర్తి, బొద్దపు శ్రీను, కరణం రవి, గొర్లి నానాజీ, పడాల శ్రీను, బొడ్డేడ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఎస్.నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగం నుంచి పాయకరావుపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థి ఎం.జ్యోతి వెంకట మహాలక్ష్మి, గ్రూప్ విభాగం నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.గగన్ కుమార్, జి.శ్రీతేజ, ఉపాధ్యాయుల నమూనాల విభాగం నుంచి రాజానగరం ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ ఖాదర్ నమూనా జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, డి.ఎస్.భవాని, కె.వి.ఎస్.ఎల్.ప్రసాద్, ఎన్.శ్రీనివాసరావు, వై.అప్పారావు, జి.గోవిందరావు, ఎన్.జి.వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు భారీ లీకేజీ

పట్టణంలో నేడు నీటి సరఫరా బంద్



పైపులైన్‌కు ఏర్పడిన భారీ లీకేజీ

యలమంచిలి రూరల్: సోముదేవపల్లి నుంచి యలమంచిలి పట్టణానికి నీటి సరఫరా అందించే పైపులైన్‌కు సోమవారం భారీ లీకేజీ ఏర్పడింది. పైపులైన్ లీకేజీని అరికట్టడానికి మరమ్మతు పనులను సోమవారం రాత్రి వరకు చేపట్టారు. ఈ కారణంగా నీటి పంపింగ్ జరగలేదు. దీంతో మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా జరగని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. ఇటీవల తరచూ ప్రధాన పైపులైన్‌కు ఏదో ఒక చోట లీకేజీ ఏర్పడడం, నీటి సరఫరా నిలిచిపోవడం జరుగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సమగ్ర రక్షిత తాగునీటి ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితేనే ప్రజల నీటి కష్టాలు తీరుతాయి. 2003లో యలమంచిలి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన తాగునీటి ప్రాజెక్టు ద్వారానే ప్రస్తుతం పట్టణంతో పాటు 16 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. ఈ పథకం తరచూ మొరాయిస్తుండడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.100 కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.